వైల్డ్ లైఫ్ మానిటరింగ్‌పై ఫారెస్ట్ అధికారులకు శిక్షణ

శిక్షణలో పాల్గొన్న ఫారెస్ట్ రేంజ్ అధికారులు, సిబ్బంది

నందికొండ, నవంబర్ 10 : నాగార్జునసాగర్ హిల్‌కాలనీలోని అటవీశాఖ కార్యాలయంలో మంగళవారం వైల్డ్ లైఫ్ స్టడీస్, మానిటరింగ్ పై కంబాలపల్లి, దేవరకొండ, నాగార్జునసాగర్ ఫారెస్ట్ రేంజ్‌లకు చెందిన అధికారులు, సిబ్బందికి శిక్షణ నిర్వహించారు. బెంగుళూరుకు చెందిన సెంటర్ ఫర్ వైల్డ్ లైఫ్ స్టడీస్‌కు చెందిన లాయర్ తిరుపతి, ప్రోగ్రామ్ మేనేజర్ బెంజిమన్, ఫిల్డ్ కోర్డినేటర్ బాబురెడ్డి శిక్షణ ఇచ్చారు. అమైండ్‌మెంట్ చట్టం 2023 ప్రకారం వైల్డ్ లైఫ్ కేసులను ఏవిధంగా నమోదు చేయాలి, ఎలా పరిష్కరిచాలనే విషయాన్ని లాయర్ తిరుపతి వివరించారు. 1972 వైల్డ్ లైఫ్ ప్రొటెక్షన్ చట్టంలో వచ్చిన మార్పులను తెలిపారు. ఈ సందర్భంగా ఫిల్డ్ కోర్డినేటర్ బాబురెడ్డి మాట్లాడుతూ తెలంగాణ, ఆంధ్ర రాష్ట్రాల్లో వైల్డ్ లైఫ్ మానిటరింగ్, కేసుల పరిష్కారంపై అటవీశాఖ సిబ్బందికి శిక్షణ ఇచ్చినట్లు చెప్పారు. ఇప్పటి వరకు 460 మందికి శిక్షణ ఇచ్చామని పేర్కొన్నారు. శిక్షణకు 45 మంది హాజరయ్యారు. కార్యక్రమంలో ఫారెస్ట్ డివిజన్ అధికారి సంగీత, రేంజర్లు, డిప్యూటీ రేంజర్లు, సెక్షన్, బీట్ అధికారలు, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థుల్లో సృజనాత్మక వెలికితీసేందుకే సైన్స్ ప్రదర్శన

- డీఈఓ భిక్షపతి

సమావేశంలో మాట్లాడుతున్న డీఈఓ భిక్షపతి

రామగిరి, నవంబర్ 12: విద్యార్థుల్లో సృజనాత్మక వెలికితీసేందుకు సైన్స్ ప్రదర్శనలు దోహదం చేస్తాయని డీఈఓ బొల్లారం భిక్షపతి అన్నారు. జిల్లాస్థాయి సైన్స్ ప్రదర్శన-2024 నిర్వహణలో భాగంగా మంగళవారం డైట్‌లో దేవరకొండ, మిర్యాలగూడ, నల్లగొండ డివిజన్లకు చెందిన సైన్స్, గణితం ఉపాధ్యాయుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఈఓ మాట్లాడుతూ విద్యార్థులు విద్యతోపాటు అన్ని రంగాల్లో రాణించేలా ప్రోత్సహించాలన్నారు. ఈ నెల చివరి వారంలో సైన్స్ ప్రదర్శన ఉంటుందని, ఉపాధ్యాయులు విద్యార్థులను చైతన్యవంతం చేసి ప్రాజెక్టులు తయారు చేయించాలన్నారు. వీటితోపాటు 114 ఇన్‌స్పైర్ మానక్ ప్రాజెక్టులను ప్రదర్శించనున్నట్లు చెప్పారు. సమావేశంలో జిల్లా సైన్స్ అధికారి వనం లక్ష్మీపతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కొడంగల్ ఘటనను వక్రీకకించడం సిగ్గుచేటు

ఆల్ ఇండియా బంజారా సేవాసంఘం రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌నాయక్

మాట్లాడుతున్న రాంచందర్‌నాయక్

మిర్యాలగూడటౌన్, నవంబర్12: వికారాబాద్‌జిల్లా కొడంగల్ అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలోని దుద్యాల మండలం లగచర్ల గ్రామంలో ఫార్మా కంపెనీ ప్రజాభిప్రాయ సేకరణలో కలెక్టర్‌పై గ్రామస్తులు దాడి చేస్తే.. గిరిజన లంబాడీలు చేసినట్లు చిత్రీకరించడం సిగ్గుచేటని ఆల్ ఇండియా బంజారా సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఇస్లావత్ రాంచందర్‌నాయక్ అన్నారు. మంగళవారం మిర్యాలగూడలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఆరు నెలలుగా ఆప్రాంత రైతులు నిరసనలు, ధర్నాలు చేస్తున్నారని, కొన్ని గ్రామాల్లో ఉద్రిక్త వాతావరణం నెలకొన్నప్పటికీ ప్రభుత్వ అధికారులు, పోలీసుశాఖ, కొడంగల్ డెవలప్‌మెంట్ అథారిటీ అధికారులు ముందస్తు జాగ్రత్తలు పాటించకుండా ప్రజాభిప్రాయ సేకరణకు రావడమేంటని ప్రశ్నించారు. అన్ని వర్గాలకు సంబంధించిన రైతులు ఆగ్రహానికి గురైతే కేవలం లంబాడీలు కలెక్టర్‌పై దాడి చేసినట్లు చెప్పడం సరికాదన్నారు. ప్రైవేట్ ఫార్మా కంపెనీ అక్కడి రైతుల భూములు లాక్కోవాలని చూడడం వల్లే ఆప్రాంత రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారన్నారు. వందలాది రైతుల పొట్టగొట్టే విధానాన్ని విడనాడాలని, గిరిజన రైతులపై పెట్టిన అక్రమకేసులను ఎత్తివేయాలని, ఈ ఘటనపై సమగ్ర విచారణ జరిపి రైతులకు న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇది పూర్తిగా ప్రభుత్వ వైఫల్యం వల్లే జరిగిన ఘటనగా బంజారా సేవాసంఘం భావిస్తుందన్నారు. ఆయన వెంట ఆల్ ఇండియా బంజారా సేవాసంఘం నియోజకవర్గ అధ్యక్షుడు ధనావత్ చిట్టిబాబు నాయక్, కుర్ర సేవానాయక్, ఆంగోతు హతీరాం, మాజీ సర్పంచులు ధనావత్ సూర్యనాయక్, కుర్ర శ్రీనునాయక్, లావూరి శ్రీనునాయక్, సైదానాయక్, వినోద్ నాయక్, అజ్మీరా శ్రీనునాయక్ పాల్గొన్నారు.

వైద్య సిబ్బంది అంకితభావంతో పని చేయాలి

- డీఎంహెచ్‌ఓ పుట్ల శ్రీనివాస్

రికార్డులను పరిశీలిస్తున్న డీఎంహెచ్‌ఓ శ్రీనివాస్

మాల్, నవంబర్ 12 : ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు సిబ్బంది అంకితభావంతో పని చేయాలని డీఎంహెచ్‌ఓ పుట్ల శ్రీనివాస్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని రాంనగర్ పల్లె దవాఖాన, అంగన్‌వాడీ కేంద్రాన్ని ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిబ్బంది సమయ పాలన పాటించాలని సూచించారు. గర్భిణులు, పిల్లల ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలన్నారు. ఆయన వెంట డిప్యూటీ డీఎంహెచ్‌ఓ కేసరవి, మండల వైద్యాధికారి వంశికృష్ణ, సూపర్‌వైజార్, ఆశ వర్కర్లు ఉన్నారు.

బీఆర్ఎస్ కార్యకర్త కుటుంబానికి పలువురి పరామర్శ

త్రిపురారం, నవంబర్ 12: మండలంలోని లౌక్యతండాకు చెందిన బీఆర్ఎస్ కార్యకర్త ధనావత్ స్వామి రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్సీ ఎంసీ. కోటిరెడ్డి, ట్రైకార్ మాజీ చైర్మన్ ఇస్లావత్ రామచందర్‌నాయక్ మంగళవారం గ్రామానికి వెళ్లి స్వామి మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట మాజీ సర్పంచులు హనుమంతునాయక్, సునీల్‌కుమార్, కాంతారావు, మొండికత్తి అశోక్ ఉన్నారు.

మాజీ సర్పంచ్ కుటుంబానికి..

తిరుమలగిరి(సాగర్) : మండలంలోని చింతలపాలెం గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ ఎల్లాల కాశయ్య సోమవారం మృతి చెందాడు. ఎమ్మెల్సీ ఎంసీ.కోటిరెడ్డి మంగళవా రం గ్రామానికి వెళ్లి కాశయ్య మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. కుటు ంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట మాజీ ఎంపీపీలు వస్తాపురి నరసింహ, అల్లి పెద్దిరాజుయాదవ్, మాజీ ఎంపీటీసీ కాశయ్య, బీఆర్ఎస్ మండల మాజీ అధ్యక్షుడు బీవీ.రమణరాజు, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ గుండాల రవి, బుజ్జినాయ క్, కృష్ణ యాదవ్, కొండల్‌యాదవ్ ఉన్నారు.

పత్రికా ప్రకటన

ఇందుమూలముగా నా యొక్క క్షయింటు అయిన శ్రీమతి కొల్లు హరిత, భర్త లేట్ కరుణాకర్, నివాసం: ఇంటి నెం.7-54, జగన్నాథపురం గ్రామం, మునగాల మండలం, సూర్యాపేట జిల్లా వారి సూచనల మేరకు సమస్త ప్రజానికముకు తెలియజేయునది ఏమనగా,
సూర్యాపేట జిల్లా, కోదాడ మున్సిపాలిటి మరియు కోదాడ రెవిన్యూలో రేరిన బ్లాక్ నెం.3, సర్వే నెం.3, సర్వే నెం.158 మిం.లె గౌతమ్ పబ్లిక్ స్కూల్ ఏరియాలో చ.గ.763.6లు నా క్షయింట్ యొక్క భర్త గారైన లేట్ కొల్లు కరుణాకర్ గారు గతములో కేశబోయిన గురవయ్య అలియాస్ గురువులు వగైరాల వద్ద కొనుగోలు చేసుకొని, లేట్ కొల్లు కరుణాకర్ గారి పేరుతో విక్రయ దస్తావేజు నెం.5339/2010గా రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. దరిమిలా అట్టి చ.గ.763.6లలో నుండి లేట్ కొల్లు కరుణాకర్ గారు జీవించి ఉన్న సమయలో వారి భార్య అయిన నా క్షయింట్ కొల్లు హరిత గారికి దస్తావేజు నెం.5894/2013 ద్వారా చ.గ.500లు రిజిస్ట్రేషన్ చేసియున్నారు.
పైన తెలిపిన చ.గ.763.6లకు సంబంధించిన (1) దస్తావేజు నెం.5339/2010 మరియు ఇట్టి ఆస్తికి సంబంధించిన హుజూర్‌నగర్ సబ్-రిజిస్ట్రార్ ఆఫీసులో రిజిస్ట్రేషన్ అయిన (2) లింక్ డాక్యుమెంట్ నెం.614/1981 దాఖలా దస్తావేజులను తీసుకొని నా యొక్క క్షయింట్ తన పనుల నిమిత్తం తేది:11-11-2024న సుమారు మధ్యాహ్నం 12 గంటల సమయంలో నల్లగొండకు వెళ్ళినారు. అక్కడ భాస్కర్ థియేటర్ ఏరియాలో ఆటోలో ప్రయాణించు సమయంలో పైన ఉదహరించిన ఆస్తికి సంబంధించిన (ఒరిజినల్ దస్తావేజు నెం.5339/2010 మరియు ఒరిజినల్ లింక్ డాక్యుమెంట్ నెం.614/1981లను పోగొట్టుకొనియున్నారు. అట్టి దస్తావేజులను నా క్షయింట్ అయిన కొల్లు హరిత గారు ఏదేని బ్యాంకులకు గాని ఆర్థిక సంస్థలకుగాని, వ్యక్తులకు గాని, ఏ విధమైన తాకట్టు గాని, కుదవ పెట్టుట గానిచేసియుండలేదు. ఇట్టి దస్తావేజుల ద్వారా ఎవరికైనా ఏ విధమైన హక్కులు సంక్రమించియున్న పక్షములో ఈ క్రింద తెలిపిన చిరునామాకు సంబంధిత ఆధారా ప్రకలతో వారి యొక్క హక్కులు ఈ ప్రకటన వెలువడిన తేదీ నుండి(7) రోజులలో తెలుపుకొనగలరు. దరిమాల వచ్చిన ఆక్షేపణలు నా యొక్క క్షయింట్‌ను ఏ విధంగా కూడా బాధ్యులను చేయజాలవు. అభ్యంతరములు తెలియజేయవలసిన చిరునామా.

సం/- షేక్ కరీముల్లా
అడ్వకేట్, బిసైడ్ షఫి టీఏఎస్ లేన్, అపోజిట్ సాయి అపార్ట్‌మెంట్, భవానీ నగర్, కోదాడ టౌన్, సూర్యాపేట జిల్లా, సెల్:9705178603.

సర్వే పేరుతో సైబర్ నేరగాళ్ల మోసం

- ప్రజలు అప్రమత్తంగా ఉండాలి
- స్రీఐ ధనుంజయ్యగౌడ్, ఎస్ఐ రామ్మూర్తి

కొండమల్లేపల్లి, నవంబర్ 12 : సమగ్ర కుటుంబ సర్వే పేరుతో సైబర్ నేరగాళ్లు కొత్త తరహా మోసానికి పాల్పడుతున్నారని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సీఐ ధనుంజయ్యగౌడ్, ఎస్ఐ రామ్మూర్తి మంగళవారం ఒక ప్రకటనలో సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ఇంటింటి సర్వే ప్రస్తుతం కొనసాగుతుందని, దీనిని ఆసరాగా చేసుకొని కొంత మంది సైబర్ నేరగాళ్లు ప్రజలకు ఫోన్ చేసి ఆధార్ కార్డు, బ్యాంక్ పాస్‌బుక్ అడిగితే ఇవ్వవద్దని, ఫోన్ నంబర్, ఓటీపీ అడిగితే చెప్పవద్దని పేర్కొన్నారు. బ్యాంకు అధికారులమని, రుణమాఫీ వస్తుందని, కరెంట్ బిల్లు కట్టాలని, కేవైసీ అప్‌డేట్ చేయాలని చెప్పినా నమ్మవద్దని, సోషల్ మీడియాలో మీకు తెలియని లింకులు పంపిస్తే ఓపెన్ చేయవద్దని సూచించారు.

మద్దతు ధర కంటే తక్కువకు కొంటే చర్యలు

- ఇప్పటి వరకు 2.50 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు
- సబ్ కలెక్టర్ నారాయణ్ అమిత్

యాద్గార్‌పల్లి రైస్‌మిల్లును తనిఖీ చేసి వివరాలు తెలుసుకుంటున్న సబ్ కలెక్టర్ నారాయణఅమిత్

మిర్యాలగూడ/మిర్యాలగూడ రూరల్, నవంబర్ 12: మిల్లర్లు మద్దతు ధర కంటే తక్కువకు ధాన్యాన్ని కొనుగోలు చేస్తే చర్యలు తీసుకుంటామని సబ్ కలెక్టర్ నారాయణ్‌అమిత్ హెచ్చరించారు. మంగళశారం సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మిర్యాలగూడలో ధాన్యం కొనుగోళ్లు సాఫీగా సాగుతున్నాయని, ఇప్పటి వరకు 2.50 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసినట్లు తెలిపారు. సూర్యాపేట, కోదాడ, హుజూర్‌నగర్‌తో పాటు ఇతర ప్రాంతాలకు చెందిన రైతులు తమ ధాన్యాన్ని విక్రయించేందుకు మిర్యాలగూడ వస్తున్నారని, అలాంటి వారికి టోకెన్లు అందించనున్నట్లు పేర్కొన్నారు. రైతులు తమ మండల వ్యవసాయ అధికారుల ద్వారా టోకెన్లు పొందాలని సూచించారు. ప్రతిరోజు 3వేల ట్రాక్టర్ల ధాన్యం కొనుగోలుకు అవకాశం ఉంటుందని, అందుకు అనుగుణంగా 1200 ట్రాక్టర్ల ధాన్యం టోకెన్లను అందిస్తామన్నారు. ప్రతి రోజు రైస్ మిల్లులను తనిఖీ చేసి మద్దతు ధర విషయంలో రైతుల ద్వారా తెలుసుకుంటామన్నారు. మంగళవారం మిర్యాలగూడ మండలం యాద్గార్‌పల్లి గ్రామపంచాయతీ పరిధిలోని వాగ్దేవి, వైష్ణవి, సూర్య మిల్లులను తనిఖీ చేసినట్లు చెప్పారు. రైస్ మిల్లర్లు ధాన్యం కొనుగోలు చేసిన పూర్తి వివరాలతో రిజిస్టర్ మెయింటెనెన్స్ చేయాలన్నారు. రైతులు మిల్లుల వద్ద తమ ధాన్యానికి లభించిన రేటు నచ్చితేనే అమ్మాలని లేక పోతే ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలకు తీసుకెళ్లి మద్దతు ధరతోపాటు క్వింటాకు రూ.500 బోనస్ పొందాలన్నారు. రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ధాన్యం కొనుగోళ్లపై ప్రతిరోజు మానిటరింగ్ చేస్తామని చెప్పారు. ఆయన వెంట తాసీల్దార్ హరిబాబు ఉన్నారు.

నేడు పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం

నల్లగొండ సిటీ, నవంబరు12 : విద్యుత్ లైన్లకు తగులుతున్న చెట్ల కొమ్మలను తొలగించే పనులు చేపడుతున్నందున బుధవారం పట్టణంలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్ అధికారులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రకాశం బజార్, మిర్యాలగూడరోడ్డు, ఎస్ఆర్ గార్డెన్, మాన్యంచెల్క, ఆర్టీసీ కాలనీ, శ్రీనివాస్‌కాలనీ, గొల్లగూడ, పెద్దబండ, కలెక్టరేట్, ఫారెస్ట్ ఆఫీస్ ప్రాంతాల్లో ఉదయం 8.30 నుంచి 12.30 వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు.

నార్కట్‌పల్లి మండలంలో

నార్కట్‌పల్లి : మండల కేంద్రంలోని 33 కేవీ ఫీడర్ మరమ్మతు కారణంగా బుధవారం ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు నార్కట్‌పల్లి, బీ. వెల్లెంల, చెర్వుగట్టు, నెమ్మాని, నక్కలపల్లి సబ్‌స్టేషన్ల పరిధిలోని గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ట్రాన్స్‌కో ఏఈ చంద్రశేఖర్‌రావు మంగళవారం ప్రకటనలో తెలిపారు.

మాడ్గులపల్లి మండలంలో..

మాడ్గులపల్లి : మండల కేంద్రంలోని సబ్ స్టేషన్‌లో మరమ్మతు పనులు చేపడుతున్న కారణంగా బుధవారం మాడ్గులపల్లి, చెరువుపల్లి, ఇందుగుల, ఆగామోత్కూర్, సీత్యాతండా, పాములపాడు సబ్ స్టేషన్ల పరిధిలోని గ్రామాలకు ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏఈ మణిదీప్ తెలిపారు.

సెల్ టవర్‌కు అనుమతివ్వొద్దని పజ్జూరు గ్రామస్తుల వినతి

నల్లగొండ, నవంబర్12 : తిప్పర్తి మండలం పజ్జూరు గ్రామంలో జనావాసాల మధ్య నిర్మిస్తున్న సెల్ టవర్‌తో ప్రజలు ఇబ్బందులు పడే అవకాశం ఉందని, దాని అనుమతులు రద్దు చేయాలని కోరుతూ మాజీ సర్పంచ్ మోయిజ్ ఆధ్వర్యంలో గ్రామస్తులు మంగళవారం కలెక్టరేట్ ఏఓ మోతీలాల్‌కు వినతి పత్రం అందించారు. సెల్‌టవర్‌ను జనవాసాల మధ్య నిర్మించొద్దని కంపెనీ వారిని కోరితే కేసులు పెడతామని బెదిరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు సత్వరమే టవర్ నిర్మాణ అనుమతులు రద్దు చేయాలని కోరారు. అంతకు ముందు మండల కేంద్రంలో తాసీల్దార్ స్వప్న, ఏఈ రమ్యకు కూడా వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో దొమ్మాటి శ్రీనివాస్, మాంతంగి శోభన్‌బాబు, మురారిశెట్టి అరుణా బాషయ్య, జంజరాల సైదులు, పాంపాటి గణేశ్, మాజీ డైరెక్టర్ గడగోజు సత్యనారాయణ, గ్రామస్తులు పాల్గొన్నారు.

బర్రెలను కాసేందుకు వెళ్లి.. విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

శాలిగౌరారం, నవంబర్ 12 : మండలంలోని బైరవునిబండ గ్రామంలో బర్రెలను కాసేందుకు వెళ్లిన వ్యక్తి విద్యుదాఘాతంతో మంగళవారం మృతి చెందాడు. ఎస్ఐ సైదులు తెలిపిన వివరాల ప్రకారం.. బైరవునిబండ గ్రామానికి చెందిన మణికొండ యాదయ్య(58) అదే గ్రామానికి చెందిన పులిగిళ్ల గంగయ్యకు చెందిన బర్లను కాసేందుకు కూలికి వెళ్లాడు. గంగయ్యకు చెందిన పొలం వద్ద బర్లను మేపుతుండగా తెగిపడిన విద్యుత్ తీగ అతడి కాలుకు తగిలింది. దాంతో విద్యుదాఘాతంతో యాదయ్య అక్కడికక్కడే మృతి చెందాడు. యాదయ్య కుమారుడు రవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

నేటి నుంచి నార్కట్‌పల్లిలో సురభి నాటకోత్సవాలు

నార్కట్‌పల్లి, నవంబర్ 12 : సురభి నాటక ప్రదర్శన ప్రారంభమై 50 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా నార్కట్‌పల్లి పట్టణంలో బుధవారం నుంచి మూడు రోజుల పాటు సురభి నాటక ప్రదర్శన నిర్వహిస్తున్నట్లు విజయభారతి నాట్యమండలి ప్రధాన కార్యదర్శి వి.ఉపేందర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 13న మాయా బజార్, 14న మాయల మరాఠీ, 15న భక్త ప్రహ్లాద నాటక ప్రదర్శన ఉంటాయని పేర్కొన్నారు. నాటకోత్సవాలను ప్రారంభించేందుకు రిటైర్డ్ ఐఏఎస్ డాక్టర్ కేవీ రమణాచారి, తెలుగు భాషా సాంస్కృతిక శాఖ సంచాలకులు హరికృష్ణ, జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఎమ్మెల్యే వేముల వీరేశం రానునన్నట్లు తెలిపారు.

పవన్ మోటర్స్‌లో మారుతి సుజుకి డిజైర్ కారును ఆవిష్కరిస్తున్న ఎస్పీ శరత్ చంద్ర పవార్, పవన్ మోటర్స్ చైర్మన్ కోమటిరెడ్డి మోహన్‌రెడ్డి, ఎండీ చంద్ర పవన్‌రెడ్డి

మారుతి సుజికి డిజైర్ కారు ఆవిష్కరణ

నల్లగొండ రూరల్, నవంబర్ 12: నల్లగొండ పట్టణ పరిధిలోని చర్లపల్లిలో గల పవన్ మోటర్స్ షోరూమ్‌కు కొత్తగా వచ్చిన మారుతి సుజుకి డిజైర్-2024 కారును మంగళవారం ఎస్పీ శరత్ చంద్ర పవార్, పవన్ మోటర్స్ చైర్మన్ కోమటిరెడ్డి మోహన్‌రెడ్డి, ఎండీ చంద్ర పవన్‌రెడ్డితో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పవన్ మోటర్స్ ఎండీ చంద్ర పవన్‌రెడ్డి మాట్లాడుతూ కొత్త మారుతి సుజుకి డిజైర్ కారు ఎల్ఎక్స్, వీఎక్స్, జెడ్ఎక్స్, జెడ్ఎక్స్ ప్లస్ మోడల్స్‌లో లభిస్తుందన్నారు. వినియోగదారుల భద్రత అవసరాలను తీర్చడానికి మారుతి సుజుకి డిజైర్‌ను సురక్షితంగా తయారు చేసిందన్నారు. ఇది గ్లోబల్ ఎన్‌సీఏపీలో 5 స్టార్ రేటింగ్ పొందిందన్నారు. కార్యక్రమంలో షోరూమ్ సిబ్బంది పాల్గొన్నారు.

14న సీపీఎం మండల మహాసభ

కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న సీపీఎం నాయకులు

నార్కట్‌పల్లి, నవంబర్ 12 : ఈ నెల 14న మండలంలోని ఎల్లారెడ్డిగూడెం వినాయక ఫంక్షన్‌హాల్లో నిర్వహించే సీపీఎం మండల మహాసభను విజయవంతం చేయాలని పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు ఎస్ఆర్ వెంకటేశ్వర్లు కోరారు. మంగళవారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో మహాసభకు సంబంధించిన కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకిచ్చిన హామీలను విస్మరించిందన్నారు. వాటిని అమలు చేయని పక్షంలో సీపీఎం ప్రజల తరపున పోరాడుతుందని హెచ్చరించారు. కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి చెరుకు పెద్దులు, నాయకులు చింతపల్లి బయ్యన్న, కొప్పు శ్రవణ్, దండు రవి, శ్రీను, ఎల్లయ్య, లింగయ్య పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ నెట్ బాల్ పోటీల్లో నందికొండ విద్యార్థుల ప్రతిభ

విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

నందికొండ, నవంబర్ 12 : రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ నెట్ బాల్ పోటీల్లో నాగార్జునసాగర్ హిల్ కాలనీలోని సెయింట్ జోసఫ్ పాఠశాలకు చెందిన విద్యార్థులు ప్రతిభ కనబర్చి ప్రథమ, ద్వితీయ బహుమతులు అందుకున్నట్లు పాఠశాల హెచ్ఎం లలిత తెలిపారు. ఈ నెల 8,9,10 తేదీల్లో నెట్ బాల్ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ ఆధ్వర్యంలో అదిలాబాద్ జిల్లా నిర్మల్‌లో జరిగిన రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ నెట్ బాల్ పోటీల్లో తమ పాఠశాల విద్యార్థులు పాల్గొని విజేతలుగా నిలిచినట్లు ఆమె పేర్కొన్నారు. మంగళవారం విద్యార్థులను పాఠశాల హెచ్ఎంతో పాటు ఉపాధ్యాయులు అభినందించారు. కార్యక్రమంలో సిస్టిర్ క్లారా, పీఈటీ కిరణ్ పాల్గొన్నారు.

కులగణన సర్వే ఎన్యూమరేటర్లపై పని ఒత్తిడి తగ్గించచాలి

- సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తుమ్మల వీరారెడ్డి

సమావేశంలో మాట్లాడుతున్న తుమ్మల వీరారెడ్డి

రామగిరి, నవంబర్ 12: రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల గణన సర్వేలో ఎన్యూమనేటర్లుకు ఆటంకాలు లేకుండా, క్షేత్రస్థాయిలో ఒత్తిడి తగ్గించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తుమ్మల వీరారెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఒక ఎన్యూమరేటర్‌కు 175 ఇండ్లు ఇచ్చి తక్కువ సమయంలో పూర్తి చేయాలని చెప్పడం సరికాదన్నారు. ప్రైమరీ స్కూల్ టీచర్లు, అంగన్‌వాడీ, ఆశ, ఐకేపీ, ఆర్‌పీ, గ్రామపంచాయతీ, మున్సిపాల్టీ సిబ్బందికి మాత్రమే డ్యూటీలు వేశారన్నారు. క్షేత్రస్థాయిలో ఎన్యూమరేటర్ల సంఖ్య పెంచి వారిపై ఒత్తిడి తగ్గించాలన్నారు. అనారోగ్యం, ఇతర కారణాలతో ఒక రోజు సర్వేకు వెళ్లకుంటే షోకాజు నోటీసు ఇస్తామంటూ బెదిరించడం సాధ్యం కాదన్నారు. ఒక్కో ఎన్యూమరేటర్‌కు 100 ఇండ్లు మాత్రమే ఉండేలా చూడాలన్నారు. సమావేశంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు చినపాక లక్ష్మీనారాయణ, జిల్లా సహాయ కార్యదర్శి దండెంపల్లి సత్తయ్య పాల్గొన్నారు.

కారు ఢీకొని మహిళ మృతి

తిప్పర్తి, నవంబర్12 : రోడ్డు వెంట నడుచుకుంటూ వెళ్తున్న మహిళను కారు ఢీ కొని మహిళ మృతి చెందిన ఘటన మండలంలోని మల్లేపల్లివారి గూడెం వద్ద సోమవారం సాయంత్రం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని జంగారెడ్డిగూడెం గ్రామానికి చెందిన ఓర్సు రాములమ్మ(65) రామలింగాల గూడెం నుంచి జంగారెడ్డి గూడేనికి కాలినడకన బయల్దేరింది. మల్లేపల్లి వారిగూడెం హెచ్‌పీ పెట్రోల్ బంక్ వద్ద నల్లగొండ నుండి మిర్యాలగూడ వైపునకు వెళ్తున్న కారు ఢీకొట్టింది. దాంతో ఆమెకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందింది. ఆమె కుమారుడు ఓర్సు వెంకన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ సింగం రామ్మూర్తి తెలిపారు.

ఆటో బోల్తా.. పత్తి కూలీలకు గాయాలు

చందంపేట(నేరేడుగొమ్ము), నవంబర్ 12 : పత్తి కూలీలతో వెళ్తున్న ఆటో అదుపు తప్పి నేరేడుగొమ్ము మండలం కాచరాజుపల్లి పుష్కర ఘాట్ సమీపంలో మంగళవారం బోల్తా పడింది. దాంతో 8మంది కూలీలకు గాయాలయ్యాయి. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని మాచర్ల మండలం రాయవరం గ్రామం నుంచి 20 మంది కూలీలు రెండు ఆటోల్లో పత్తి తీసేందుకు చందంపేట మండలంలోని పొగిళ్ల గ్రామానికి బయల్దేరారు. కాచరాజుపల్లి పుష్కరఘాట్ వద్ద ఆటో బ్రేక్ ఫెయిల్ కావడంతో అదుపుతప్పి బోల్తా పడింది. దాంతో అందులో ఉన్న కూలీలు అమరేస్ కళమ్మ, ఎస్తేరమ్మకు తీవ్ర గాయాలయ్యాయి. మరో ఆరుగురికి స్వల్ప గాయాలయ్యాయి. తీవ్రంగా గాయపడిన కళమ్మను చికిత్స నిమిత్తం హైదరాబాద్‌కు, ఎస్తేరమ్మను మాచర్ల ఆస్పత్రికి తరలించారు. మిగతా వారిని దేవరకొండ ఏరియా ఆస్పత్రిలో చికిత్స అందించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సతీష్ తెలిపారు.

మునుగోడులో దొడ్డి కొమురయ్య విగ్రహావిష్కరణ


దొడ్డి కొమురయ్య విగ్రహావిష్కరణలో పాల్గొన్న నాయకులు

మునుగోడు, నవంబర్12 : మండల కేంద్రంలోని బస్టాండ్ వద్ద ఏర్పాటు చేసిన తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట తొలి అమరుడు దొడ్డి కొమురయ్య విగ్రహాన్ని మంగళవారం పలువురు ప్రముఖులు ఆవిష్కరించారు. ఈ